విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి
- ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎమ్మెల్సీ ఇక్బాల్ పిలుపు
- జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పురస్కారాల ప్రదానం


మడకశిర: విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


హిందూపురం: పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

మడకశిర: విద్యార్థులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా పురస్కారాలు అందిస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎంఈఓ భాస్కర్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా టెన్త్, ఇంటర్‌లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలతో పేద విద్యార్థుల చదువులు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే బాగున్నాయని పేర్కొన్నారు. వైఎస్ జగన్ కృషితో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోందన్నారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ భూతరాజు, ఎంపీపీలు కవిత, ఈరన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంఈఓలు భాస్కర్, శ్రీధర్, సత్యనారాయణ, గోపాల్, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, కౌన్సిలర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హిందూపురం: సీఎం జగన్ విద్యాభివృద్ధికి చొరవ తీసుకుని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. స్థానిక అజీజియా ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 9 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట ఉన్న పాఠశాలలను మూసివేసిందన్నారు. విద్యను నారాయణ, చైతన్య కార్పొరేట్ స్కూళ్లకు పరిమితం చేయడానికి అడుగులు వేసిందన్నారు. అయితే జగనన్న ప్రభుత్వంలో పేద విద్యార్థికి విద్య అందాలనే ఉద్దేశంతో పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అందిస్తున్న పురస్కారాలు మరింత మందికి ప్రేరణగా నిలవాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్, పాఠశాలకు మెమెంటో ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, సినిమాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. సీఎం జగన్ నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. ఇది ఓర్వలేక ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప, నాగరాజు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సీలిమ, ఎంజేపీ ప్రిన్సిపాల్ మురళీమోహన్, కౌన్సిలర్లు రోషన్ అలీ, నసిరాబాను, హెచ్‌ఎం రంగనాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరు..

హిందూపురం: వారాహి, నారాహి ఎవరు ఏ వాహనంలో తిరిగినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరంను చంద్రబాబు ఏటీఎంగా వాడుకున్నారని.. ఆయన నిర్మిస్తున్నది సూర్యోదయ నగరం కాదు సుపుత్రుడి కోసం నిర్మిస్తున్న నగరమని విమర్శించిన బీజేపీ నాయకులు ఇప్పుడు టీడీపీని ఎలా పొగుడుతారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పొత్తు, మెప్పు కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని ఆరోపించారు. అమరావతి వద్దన్న బీజేపీ ఇప్పుడు ఏ విధంగా సమర్థిస్తుందని ప్రశ్నించారు. ఓట్లు, సీట్ల కోసం నాటకాలు ఆడుతూ, అబద్ధాలు చెప్పినా.. మిమల్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 650 హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు పథకాలను కాపీ కొట్టి ఆల్ ఫ్రీ ఇస్తానంటున్నారని మండిపడ్డారు. హామీలిచ్చి ఎగ్గొట్టిన చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

వీకెండ్ పొలిటీషియన్ హడావుడి

వీకెండ్ పొలిటీషియన్ పవన్ కళ్యాణ్ శని, ఆదివారాల్లో హడావుడి చేస్తారని ఎద్దేవా చేశారు. తన మనుగడ, అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు యాత్ర చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ముగ్గురిది ఒకే అజెండా అన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. లోకేష్, పవన్ కలిసి వారాహిలో తిరగాలని ఎద్దేవా చేశారు. ఎంతమంది కలిసి వచ్చినా ఎన్నికుట్రలు, కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ


విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

అమరాపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం రఘు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, బ్యాగులు, నోటు పుస్తకాలు, బెల్టులు, యూనిఫాం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యంజేరప్ప, నరసింహమూర్తి, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని కలిపి కాలని వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సర్పంచ్ కదిరమ్మ విద్యాకానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నగేష్, నాయకులు నరేంద్ర, శివరాజ్, స్కూల్ కమిటీ చైర్మన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశారని 32వ వార్డు కౌన్సిలర్ రేష్మాబాను అన్నారు. గురువారం అహ్మద్‌నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం నసీఫాబానుతో కలిసి విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, బాబు, ముస్తఫా, ఫారుఖ్ పాల్గొన్నారు.

'నాడు–నేడు' పనుల పరిశీలన

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంపీడీఓ సరస్వతి గురువారం పరిశీలించారు. పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న లెట్రిన్, బాత్‌రూం, ప్రహరీని పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. వైఎస్సార్ బీమా నమోదు, రెన్యూవల్ తీరుపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, రికార్డులను పరిశీలించారు.

నాగబింబ విగ్రహ ప్రతిష్ట



రొళ్ల: ఎం.రాయాపురం గ్రామంలో గురువారం నాగబింబ విగ్రహ ప్రతిష్ట వైభవంగా సాగింది. మూడు రోజులుగా రోజు ఓ పూజా కార్యక్రమం చొప్పున విశేష పూజలు చేశారు. గురువారం ముగింపు కార్యక్రమం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేయించారు. వేదపండితులు గణపతి పూజ, ప్రతిష్టాంగ హోమం, కలశస్థాపన, అంకురార్పణ తదితర పూజలు చేసి మహామంగళారతి ఇచ్చారు. కార్యక్రమంలో శిర ఎమ్మెల్యే టీబీ జయచంద్ర, మాజీ ఎమ్మెల్యే రాజేష్‌గౌడ, మాజీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జి.తిప్పేస్వామి, జెడ్పీటీసీ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే కాన్పులు చేయాలి

గోరంట్ల: కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు చేయాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ ప్రమీల డాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కాన్పులను హిందూపురం ఆస్పత్రికి రెఫర్ చేయొద్దని సూచించారు. గర్భిణులు ఇబ్బందులు పడకుండా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ డాక్టర్ శృతి, సర్పంచ్ అనిత, పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం

పెనుకొండ: పట్టణంలోని సెంట్రల్ స్కూల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన


మడకశిరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిర: పట్టణంలోని వివిధ వార్డుల్లో గురువారం మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజినేయులు, ఎంపీడీఓ సోనిబాయి, సీడీపీఓ నాగమల్లేశ్వరి, మండల ప్రజాపరిషత్ ఏఓ ఆరాధ్య, డివిజన్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు లీలావతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

మలేరియా నివారణ మాసోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు, స్టిక్కర్లను మడకశిర ప్రభుత్వాస్పత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ దివాకర్ గురువారం విడుదల చేశారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి కోదండ రామిరెడ్డి, డాక్టర్ నేహ, సూపర్‌వైజర్ వరలక్ష్మమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్

రొద్దం: ఉపాధి పనులను నాణ్యతగా చేయాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. గురువారం ఉదయం మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్య, మస్టర్‌ను తనిఖీ చేశారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. పనులు నాణ్యతగా చేస్తే వేతనం రూ.272 వరకూ అందుతుందని తెలిపారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కూలీల హాజరు శాతం పెంచాలి

గుడిబండ: మండలంలో ఉపాధి పనులకు కూలీల హాజరు శాతం పెంచాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో అలసత్వం వద్దు

చిలమత్తూరు: మండలంలో భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. మండలంలో భూముల రీ సర్వేలో వెనుకబడి ఉన్నారన్నారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. జూలై మాసంలో మండలంలోని యగ్నిశెట్టిపల్లి, సుబ్బరావుపేట భూములను సర్వే చేయాలని ఆదేశించారు. రీసర్వే విషయంలో అలసత్వం తగదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, రీసర్వే డీటీ యూనిస్, రీసర్వే ఇన్‌చార్జి చిట్టిబాబు, సర్వేయర్లు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని అక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోండి

మడకశిరరూరల్: జక్కేపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం వేసిన బోరును మూసి వేసి ప్రభుత్వ స్థలాన్ని అక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజినేయులకు వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్ల క్రితం వేసిన బోరును ఓ వ్యక్తి మూసి వేశాడన్నారు. ప్రభుత్వ స్థలాన్ని అక్రమించుకుని ప్రహారీ నిర్మాణం చేపట్టారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే సర్పంచ్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ కార్యదర్శి ద్వారా పరిశీలించి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

నివేదికలు సమర్పిస్తే స్మాల్ ఫార్మర్ సర్టిఫికెట్ల మంజూరు

రొళ్ల: వీఆర్వోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పిస్తే స్మాల్ ఫార్మర్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఇటీవల రైతులు కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపాధి పథకం కింద పండ్ల తోటల పెంపకానికి స్మాల్ ఫార్మర్ సర్టిఫికెట్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

వివాదాస్పద భూమి సర్వే



భూమిని సర్వే చేస్తున్న మండల సర్వేయర్ కోదండ పాణి

పెనుకొండ రూరల్: శెట్టిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లోని 2.82 ఎకరాల ప్రభుత్వ భూమిని (కుంటకట్ట) కొందరు ఆక్రమించారు. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లేందుకు పలువురు రైతులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంపై కొందరు రైతులు గత నెలలో సబ్ కలెక్టర్ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం మండల సర్వేయర్ కోదండ పాణి సిబ్బందితో కలసి భూమిని సర్వే చేశారు. అయితే సర్వే పనులు పూర్తికాక ముందే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సర్వే పనులను ఆపేసినట్లు సర్వేయర్ కోదండ పాణి తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు శోభారాణి, కార్యదర్శి లావణ్య, నాయకురాళ్లు శైలమ్మ, వరలక్ష్మి, సోనియా, నాగమ్మ, భారతి, పద్మ, ధనమ్మ, భాగ్యమ్మ, శివమ్మ, సీఐటీయూ నాయకులు జగదీష్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి తహసీల్దార్‌గా సురేష్ కుమార్



సోమందేపల్లి: మండల రెవెన్యూ అధికారిగా సురేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ రెండు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సౌజన్య లక్ష్మి పని చేశారు. అమరాపురంలో పని చేస్తున్న తహసీల్దార్ సురేష్ కుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు.

పోతులప్ప స్వామి అలయ నిర్మాణానికి భూమిపూజ

చిలమత్తూరు: మండల పరిధిలోని కాపుచెన్నంపల్లిలో పోతులప్ప స్వామి అలయ నిర్మాణానికి గురువారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. అదే గ్రామానికి చెందిన పాత్రికేయుడు నరసింహా రెడ్డి అలయ గోపుర నిర్మాణ భాధ్యతలు తీసుకున్నారు. ఇందుకోసం రూ.6 లక్షలు వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాగరాజు, గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశులు, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

మడకశిర: కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామికి నియోజకవర్గంలోని కాంట్రాక్టు అధ్యాపకులు వినతిపత్రం అందించారు. 2014 సంవత్సరం జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీస్ పూర్తి నిబంధనను సడలించి న్యాయం చేయాలని కోరారు. సీఎం తప్పకుండా న్యాయం చేస్తారని కాంట్రాక్టు అధ్యాపకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు అందిస్తున్న దాతలు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన దొడ్డహళ్ళి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వినాయక మిత్ర బృందం, మారుతి స్వసహాయ సంఘం పదాధికారులు గురువారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మానాయక్, సహోపాధ్యాయుడు యతి కుమార్, రవి కుమార్, మారుతీశ్, అంజి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకు అందిస్తున్న గృహ రుణాలను ఖాతాదారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద ఓ ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలను బ్యాంకులో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఎంకు సన్మానం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఎగువ ఈచలేడ్డి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన తేజావతిని గురువారం సన్మానించారు. కార్యక్రమంలో నూతన హెచ్‌ఎం పుష్పలత, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి నరసింహప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లికార్జున, జగదీష్, ఆనంద్, మంజునాథ్, నరసింహమూర్తి, రామచంద్ర, నాగేంద్ర, రామాంజినప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వైఎస్సార్ బీమా' నమోదు పూర్తి చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలో వైఎస్సార్ బీమా నమోదును వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని హలుకూరు సచివాలయం–2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్ బీమా నమోదు చేయాలన్నారు. అలాగే ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను నోటీస్ బోర్డులో అతికించాలన్నారు. సేవా రుసుమును బ్యాంకు ఖాతాలో జమ చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. ప్రభుత్వం అందించిన యూనిఫాంను తప్పక ధరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను రిజిష్టర్‌లో నమోదు చేసి, శాఖల వారీగా వాటిని పరిష్కరించాలన్నారు.

వీఆర్వోల బదిలీ

రొళ్ల: మండలంలోని బీజీ హళ్లి వీఆర్వోగా పని చేస్తున్న ప్రకాష్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా రత్నగిరి వీఆర్వోగా బదిలీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రత్నగిరి వీఆర్వోగా పని చేస్తున్న నాగరాజు అగళి మండలం రావుడికి బదిలీపై వెళ్లారు. అదేవిధంగా మల్లినమడుగు వీఆర్వోగా పని చేస్తున్న సురేష్‌ను బీజీ హళ్లికి ఇన్‌చార్జ్ వీఆర్వోగా నియమించడం జరిగిందని వెల్లడించారు.

50 శాతం సబ్సిడీతో విత్తన రాగులు


ఆర్బీకేలో విత్తన రాగుల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఓ రాజ్యలక్ష్మి

రొళ్ల: ఇంద్రావతి రకం విత్తన రాగులను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తామని ఏఓ రాజలక్ష్మి తెలిపారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని కాకి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులకు విత్తన రాగులను పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నాలుగు కిలోల ప్యాకెట్‌ను రూ.278కి కొనుగోలు చేసి సబ్సిడీతో రూ.139కే అందిస్తోందన్నారు. నీటి వసతి, వర్షాధారం కింద పంట సాగు చేసే రైతులు రాగి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జటిక రోగాన్ని తట్టుకుని 120 రోజులకు పంట చేతికి వస్తుందన్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి క్వింటాల్‌కు రూ.3,578 చొప్పున చెల్లింస్తుందని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగనాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం, గుత్తివారిపల్లి, బూడిదగడ్డపల్లి గ్రామాల్లో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని తహసీల్దార్ రంగానాయకులు అన్నారు. గురువారం ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి సాధించడంలో సచివాలయ ఇంజినీర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీర్లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రొప్పం పంచాయతీ అధ్యక్షురాలిగా ఉమాదేవి


నూతన అధ్యక్షురాలిని అభినందిస్తున్న సభ్యులు

పావగడ: రొప్పం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా బొమ్మతనహళ్లి గ్రామానికి చెందిన న్యాయవాది అంబరీష్ సతీమణి ఉమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీ ఆవరణలో గురువారం జరిగిన ఎన్నికలో ఆమె ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేశారు. దీంతో ఉమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ సుజాత అధికారికంగా ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో ఉన్న 12 మంది సభ్యులు ఉమాదేవికి మద్దతు ఇచ్చారు. తాజా మాజీ అధ్యక్షురాలు గీత సొగడు వెంకటేష్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని ఈ ఎన్నికతో పూర్తి చేశారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	35.0
పెనుకొండ	38.0
మడకశిర	35.0

సచివాలయం తనిఖీ

గోరంట్ల: మండల కేంద్రంలోని సచివాలయం–4ను ఎంపీడీఓ రఘునాథగుప్తా, ఎంపీపీ ప్రమీల ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ బీమా నమోదు వివరాలను వేల్ఫేర్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గోరంట్ల: గంగంపల్లి పంచాయితీ పరిధిలోని ఎగువ గంగంపల్లి, దాసనిరెడ్డిపల్లి తండాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గొల్ల లక్ష్మీనరసప్ప, ఎంపీడీఓ రఘునాథగుప్త తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ అతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అమరాపురం: నిద్రగట్ట సచివాలయం పరిధిలోని యర్రగుంటపల్లిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

27లోపు రేషన్ బియ్యం తీసుకోండి

పావగడ: ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఎన్ఐసీ సర్వర్ అప్‌డేట్ చేయనున్నారు. ఈనెల 27లోపు రేషన్‌కార్డు దారులు సంబంధిత చౌకధాన్యపు డిపోల్లో ఆహార ధాన్యాలు పొందాలని తహసీల్దార్ సుజాత గురువారం ఓ ప్రకటనలో సూచించారు.